పండుగ తరువాతే పరిశీలన

డీఎస్సీ అభ్యర్థులకు ఊరట

మెయిన్‌లో..



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కష్టపడ్డ వారికే పదవులు

- కార్యకర్తలే టీడీపీ బలం: మంత్రి భరత్
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : మంత్రి సవిత
- చంద్రబాబు రాష్ట్రానికే గర్వకారణం : మాజీమంత్రి దేవినేని
- పుట్టపర్తిలో టీడీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం
- పార్టీ పదవుల కోసం త్రిసభ్య కమిటీకి దరఖాస్తుల వెల్లువ



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న త్రిసభ్య కమిటీ, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

పుట్టపర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పదవులు ఇచ్చి, గౌర విస్తామని రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మామిళ్లకుంట పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులైన మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఆధ్యతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ దేశంలో ఏరాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కార్యకర్తల కష్టంతోనే పార్టీ నిలబడిందని, కష్టపడే వారికి పదవుల్లో ప్రాధాన్యం, గుర్తింపు తప్పకుండా దొరుకుతుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీలో అధిష్టాన నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు.

చంద్రబాబుకు 'స్థానిక' గిఫ్ట్ ఇద్దాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ చరిత్ర కల్గిన టీడీపీకి కార్యకర్తలే బలం అన్నారు. గత వైసీపీ నేతల అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత టీడీపీ కార్యకర్తలకే దక్కుతుందన్నారు. పార్టీ పదవుల విషయంలో కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యుతకు పెద్ద పీట వేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. సమన్వయంతో పార్టీ జిల్లా కమిటీని ఎంపిక చేసుకుందామని కార్యకర్తలకు సూచించారు. పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా పెనుకొండలో కాస్య విగ్రహం ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

మాజీ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ నిర్ణయంతో హంద్రీనీవా ద్వారా ఉమ్మడి అనంత జిల్లా సస్యశామలం అవుతోందన్నారు. తన విజన్‌తో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న ఘనత చంద్రబాబుకే సొంతమన్నారు. వైసీపీ పాలనలో గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధిని, తన అనుభవంతో ఏడాదిలోనే గాడిన పెట్టిన చంద్రబాబులాంటి నాయకుడు ఉండటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. నాసికరం మద్యంతో వేల కోట్లు దోచుకున్న వైసీపీపై ధైర్యంగా మాట్లాడే అధికార ప్రతినిధిని మీనుంచి బయటకు రావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా వైసీపీ పాలనలో కేసులతో తీవ్ర ఇబ్బందులు పడిన వారికి పార్టీ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలని పలువురు కమిటీకి విన్నవించారు. ఈ సమావేశానికి ఎంపీ బీకే పార్థసారథి, రాప్తాడు, కదిరి,

(మిగతా 6లో...)

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సమస్యలు విన్నవించుకుంటే తప్పకుండా పరిష్కారమవుతాయని ప్రజలు ఎంతో ఆశతో వస్తారనీ, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి అర్జీనీ పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ 240 అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారించి, అర్జీదారుడు సంతృప్తి పడేలా గడువులోపు తప్పకుండా పరిష్కరించాలని ఆదేశించారు.

తోపుడు బండ్ల పంపిణీ

జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ (ఎన్ఈసీసీ) సమకూర్చిన కోడిగుడ్లతో వివిధ రకాల వంటలు తయారు చేసే యంత్రాలు, తోపుడు బండ్లను కలెక్టర్ టీఎస్ చేతన్ పంపిణీ చేశారు. పుట్టపర్తిలోని డీఆర్డీఏ కార్యాలయం వద్ద వాటిని అందజేశారు. పది మందికి పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యూనిట్ విలువ రూ.50వేలు అన్నారు. రెండో దశలో డిమాండ్‌ను బట్టి మరింతమంది మహిళలకు పరికరాలు, బండ్లను అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఆర్డీఓ సువర్ణ, డీఆర్డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీసీఓ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

డీపీఓలో 80 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 80 అర్జీలను ఎస్పీ రత్న స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పునరావృతమైన ఫిర్యాదుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఎస్పీ ఫోన్ చేసి, మందలించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

కమీషన్ కోసం తమ్ముళ్ల తన్నులాట?

ఇద్దరికి గాయాలు.. స్కార్పియో అద్దాలు ధ్వంసం



గాయపడిన సాంబ



గాయపడిన కౌశిక్

బత్తలపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోయనపల్లి వద్ద ఆదివారం రాత్రి టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడగా.. ఓ వాహనం ధ్వంసం అయినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. స్థానికులు తెలిపిన మేరకు మండలంలోని కాటమకుంట గ్రామ సమీపంలో వ్యాపారులు బొగ్గులు కాలుస్తున్నారు. వీరు లారీకి రూ.పదివేల ప్రకారం కట్టకిందపల్లి విశ్వనాథ్‌నాయుడు అనుచరులకు కమీషన్ ఇస్తున్నారు. ఆదివారం రాత్రి బొగ్గులను లోడు చేసుకోని కాటమకుంట నుంచి లారీ వెళ్తుండగా గంటాపురం జగ్గు అనుచరులు కౌశిక్, సాంబ నల్లబోయనపల్లి వద్ద ఆపారు. తమకు వాట ఇచ్చేవరకు లారీని కదలనివ్వమని కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న విశ్వనాథ్‌నాయుడు తన అనుచరులతో అక్కడకు చేరుకుని జగ్గు అనుచరులు సాంబ, కౌశిక్‌పై దాడి చేసి, వారి స్కార్పియో అద్దాలు ధ్వంసం చేశారు. గాయపడ్డ వారిని స్థానికులు 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో నల్లబోయనపల్లి గ్రామానికి చేరుకొని దాడికి పాల్పడిన విశ్వనాథ్‌తో పాటు అతని అనుచరులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్‌లతో గొడవకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదు మరోలా..

అయితే పోలీసులకు కౌశిక్ మరో విధంగా ఫిర్యాదు చేశాడు. తాను విశ్వనాథ్‌నాయుడు వద్ద డ్రైవర్‌గా పనిచేసే సమయంలో రూ.రెండు లక్షలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించానన్నారు. అయితే ఆయన తనకు ప్రాంసరీనోట్‌లు ఇవ్వకపోవడంతో డ్రైవర్ ఉద్యోగం మానేసినట్లు తెలిపారు. ఈక్రమంలో ఆదివారం సాంబతో కలిసి బత్తలపల్లికి వస్తుండగా నల్లబోయనపల్లి హైస్కూల్ సమీపంలో విశ్వనాథ్ తన అనుచరుల తో వచ్చి మా వాహనాన్ని ఆపి, దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు.

పిస్తోల్ స్వాధీనం

కాగా నల్లబోయనపల్లికి చెందిన కౌశిక్ ఇంట్లో ఆదివారం రాత్రి పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన శంకరయ్య కుమారుడు కౌశిక్ ఇంట్లో పిస్తోల్ ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి వెదికామన్నారు. ట్రంక్ పెట్టెలో కనిపించిన పిస్తోల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

ప్రజల్లో సూపర్ సంతృప్తి

- అధికారుల తీరుతోనే ప్రభుత్వానికి చెడ్డపేరు
- 6న జిల్లాలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో సభ
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రజాప్రతినిధుల సిఫార్సులు పరిగణించాల్సిందే : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్
- మూడు అంశాల చుట్టూనే డీఆర్సీ సమావేశం



డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

అనంతపురం కలెక్టరేట్/వైద్యం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం(డీఆర్సీ) సోమవారం నిర్వహించారు. సమావేశానికి మంత్రి కేశవ్‌తోపాటు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమల శాఖలకు సంబంధించిన మూడు అంశాలపైనే ఎక్కువ చర్చ జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 4గంటలకు ప్రారంభమైంది. సమావేశంలో ప్రధానంగా యూరియా కొరతపై మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. అవసరం కంటే ఎక్కువగా ప్రభుత్వం సరఫరా చేసినా రైతులకు అందించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. విజిలెన్స్ అధికారులనూ తప్పుపట్టారు.

'సూపర్ సిక్స్- సూపర్ హిట్' సభ

జిల్లాలో సెప్టెంబరు 6న సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారన్నారు. వంద రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి చేసి, కుప్పంకు హంద్రీనీవా నీరు అందించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న డీఆర్సీ మీటింగ్ ఈవైట మోడ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల గణాంకాలు వెల్లడించడంలో వ్యవసాయ శాఖ వెనుకబడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రేత పత్రికలు, విపక్షాలు పనిగట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. బెంగళూరు నుంచి అనంతపురానికి ఆరులేన్ల హైవే నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

ఏపీ ఫస్ట్.. జిల్లా సెకండ్

నీటి పారుదల శాఖ అంశంపై చర్చించిన సమయంలో మంత్రి కేశవ్ మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్‌లో దేశంలోనే ఏపీ ఫస్ట్, జిల్లా సెకండ్ అని స్పష్టం చేశారు. ఈ అంశం దేశవ్యాప్తంగా చెప్పుకోదగినదైనా జిల్లా అధికారులు ఎందుకు ప్రజలకు వివరించడం లేదని నిలదీశారు. హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్, పీఏబీఆర్ వంటి నీటి సరఫరా ప్రాజెక్టుల ద్వారా జిల్లాలోని ప్రతి చెరువుకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

అధికారులతోనే ప్రభుత్వానికి చెడ్డపేరు

గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం. వీటికి అదనంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు యూరియాపై వస్తున్న విమర్శలే నిదర్శనమన్నారు. అన్నదాత సుఖీభవ రాని రైతుల సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పంటలు అధిక శాతం సాగవుతున్నాయని వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సమావేశంలో వివరించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ...ప్రైవేట్ గోడౌన్లలో యూరియా బఫర్‌స్టాక్ పెట్టారని, తనిఖీలు చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్‌కేల నుంచి యూరియా సరఫరా చేయవచ్చన్నారు. ప్రభుత్వం (మిగతా 6లో...)

నిరంతర నిఘా..!

- ప్రజా భద్రతకు సీసీ కెమెరా కళ్లు
- జిల్లాలో ఏడాదిలోనే 8,014 ఏర్పాటు
- వినియోగంపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన
- నేర నియంత్రణ దిశగా పోలీసు శాఖ అడుగులు



ఈ-సర్వైలెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

'రూ. 50 వేలు పెట్టి స్మార్ట్ టీవీ కొంటారు. దాని భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. అలాగే లక్ష రూపాయలు పెట్టి బ్రాండెడ్ ఫోన్ కొంటారు. దాని రక్షణ కోసం స్క్రీన్‌గార్డులు, ప్రత్యేక పౌచ్‌లు వేసుకుంటారు. మరి వీటితో పాటు మరెన్నో విలువైన వస్తువులకు భద్రత కల్పించే ఇంటిని మాత్రం తాళం వేసి వదిలేస్తున్నారు. నష్టం జరిగాక లబోదిబోమంటున్నారు. అలా కాకుండా ఈ బ్రాండెడ్ వస్తువులకు పెట్టే ఖర్చులో కనీసం 10 శాతం వెచ్చించి సీసీ కెమెరాలు అమర్చుకుంటే మీకు, మీ విలువైన ఆస్తులకు రక్షణగా ఉంటుంది' అంటూ జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో చైతన్యం నింపేందుకు అడుగులేస్తోంది. ఒక్క ఏడాదిలోనే 8 వేలకు పైగా కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇక ప్రతి గ్రామం ఎంట్రీ, ఎగ్జిట్‌లో సైతం కెమెరాలు ఏర్పాటు చేసి సరికొత్త నిఘాకు నాంది పలికేందుకు జిల్లా పోలీస్‌శాఖ సిద్ధమవుతోంది.

అనంతపురం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దొంగలను పట్టుకోవడం కంటే అసలు దొంగతనమే జరగకుండా చూసే దిశ గా జిల్లా పోలీసులు అడుగులు వేస్తున్నారు. నేరస్థులు దొంగతనం చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ప్రజల ఆస్తులు, ఇళ్లు, దుకాణాలు పర్యవేక్షించే వ్యవస్థలను ఏర్పాటు చేయిస్తున్నారు. అదే సీసీ కెమెరాల వ్యవస్థ. నేరస్థులను పట్టించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషి స్తుండటంతో, అవి అమర్చిన ఇళ్లు, దుకాణాల వైపు రావడానికి దొంగలు జంకుతున్నారు. దీంతో ఆ దిశగా జిల్లా పోలీస్‌శాఖ సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తెస్తోంది. జిల్లా ఎస్పీగా జగదీష్ వచ్చిన ఏడాదిలోనే జిల్లాలో 8 వేలకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రజలు, దుకాణాదారులు, ఇతర కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ వ్యక్తుల్లో చైతన్యం తెప్పించి ఆయన పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంలో సక్సెస్ అయ్యారు.

ఇళ్లు, దుకాణాలు, ప్రార్థనా మందిరాల వద్ద..

ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థలు ఇలా అనేక వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చి జిల్లా వ్యాప్తంగా 4189 కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనంతపురం నగర ప్రధాన కాలనీలు, కూడళ్లలోపాటు, జిల్లావ్యాప్తంగా పలు పల్లెలు, పట్టణాల ప్రజలకు సైతం సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు వివరించి, ఏర్పాటు చేసుకునేలా చైతన్యం

(మిగతా 6లో...)

నిలకడగా టమోటా ధరలు

- వైరస్‌తో రైతుల్లో ఆందోళన
- ఎకరాకు రూ.20వేలకు పైగా అదనపు ఖర్చు



తనకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఏడాది పొడవునా టమోటా పంట సాగుచేస్తుంటారు. ఏ సమయంలో చూసినా మండలంలో రెండువేల ఎకరాలకుపైగా టమోటా సాగులో ఉంటుంది. ఈ యేడాది ప్రారంభంలో ధరలు లేక రైతులు నష్టాలు చవిచూశారు. రెండు నెలలుగా టమోటా ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, మదనపల్లి మార్కెట్‌లో 30 కిలోల బాక్స్ రూ.700 నుంచి ప్రారంభమై రూ.1100 దాకా ధరలు ఉన్నాయి. కర్ణాటకలోని కోలారు, చింతామణి, వడ్డిపల్లి మార్కెట్‌లో 15కిలోల బాక్స్ రూ.300నుంచి రూ.700 దాకా ధరలు పలుకుతున్నాయి. టమోటా దిగుబడి వస్తున్న రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. ధరలు రావడంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులు టమోటా సాగుచేశారు. 20 రోజులుగా వాతావరణంలోని మార్పుల కారణంగా వర్షాలు పడుతూనే ఉండడం, చల్లదనం పెరగడంతో టమోటా పంటకు వైరస్ వ్యాపించింది. వైరస్‌తోపాటు ఆకుముడుత, కాయలకు మచ్చలు రావడం మొదలయ్యాయి. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ధరలు నిలకడగా ఉన్నాయి, ఎంతో కొంత డబ్బులు చేతికొస్తాయని ఆనందపడుతున్న సమయంలో ఎడతేరపిలేని వర్షాలు, వాతావరణంలో మార్పుల వల్ల టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. వైరస్, ఆకుముడత, మచ్చలను నియంత్రించడానికి రైతులు రోజుమార్చి రోజు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఎకరం పంటకు అదనంగా రూ.20వేల నుంచి రూ.30వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజుమార్చి రోజు వరసగా ఏడు నుంచి పదిసార్లు పిచికారి చేసి వైరస్‌ను నియంత్రిస్తున్నట్లు రైతులు అంటున్నారు. వైరస్ నియంత్రణతో టమోటా పంట దిగుబడి వచ్చి, ఇలాగే ధరలు కొనసాగితే ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల వరకు మిగలనున్నట్లు రైతులు చెబుతున్నారు.

రోజుమార్చి రోజు పిచికారీ చేయాల్సిందే



ఎడతెరపి లేని వర్షాలు, వాతావరణంలో మార్పులు, చల్లదనం పెరగడంతో టమోటా పంటకు వైరస్, ఆకుముడత, కాయల మచ్చలు ఏర్పడుతున్నాయి. వీటి నియంత్రణకోసం రోజుమార్చి రోజు మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. దీంతో అదనంగా ఎకరానికి మరో రూ.30వేలు ఖర్చు అవుతోంది. ధరలు నిలకడగా ఉండడంతో, అదనపు ఖర్చు పెడుతున్నాం.

\- సురేష్ రెడ్డి, రైతు, కొత్తకురవపల్లి

సబ్సిడీతో మందులు సరఫరా చేయాలి



ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు నిలకడగా ఉన్నాయి. కాయలు దిగుబడి వస్తున్నాయి. ఆనందంగా ఉంది. వాతావరణంలో మార్పులు, వర్షం కారణంగా వైరస్, ఆకుముడుత, కాయలకు మచ్చలు వ్యాపించాయి. నియంత్రణ కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీ ధరలతో పురుగు మందులు, బయో ఫెర్టిలైజర్స్ ఇప్పించాలి.

\- బయ్యారెడ్డి, రైతు, నడిమికుంటపల్లి

మట్టి వినాయకుడిని పూజిద్దాం

కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



మట్టి వినాయకులకు పూజ చేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సహజ రంగులు వేసిన మట్టివినాయక ప్రతిమలను పూజించాలన్నారు. మండపాలను నిబంధనలకు అనుగుణంగా, అధికారుల అనుమతితో ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం పలువురికి మట్టివినాయక ప్రతిమలను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ప్రజల్లో సూపర్ సంతృప్తి

(5వ పేజీ తరువాయి)

సరఫరా చేసిన యూరియా ఎక్కడికి వెళ్లిందని, వీటిని సొసైటీలకు అక్రమంగా అందజేస్తున్నారని ఆరోపించారు.

సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి

: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్

ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల సిఫార్సులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను వివరాలు కోరగా 150కు పైగా తన వద్ద ప్రజాప్రతినిధులు సిఫార్సులు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి అమలు చేసేలా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రూ.10లక్షల కోట్లతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని, వాటి ద్వారా 8లక్షల పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి అధికారి ఒకరు రూ.100కోట్లు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇది సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకమన్నారు. పరిశ్ర మలు రాష్ట్రమంతా రాబోతున్నాయని, శ్రీసత్యసాయి జిల్లాకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

- ఎన్నికల హామీలో భాగంగా టామోటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి కోరారు. పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించాలన్నారు. శింగనమల చెరువును లోకలైజేషన్ చేయాలని కోరారు.
- 'ఉచిత బస్సు నేపథ్యంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అత్యధిక మండలాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. దీంతో మహిళలకు ఫ్రీ టికెట్ ఇవ్వడం లేదు. దీన్ని సవరించాలి' అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.
- గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువుకు నీరు వదలాలని, నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని విన్నవించారు.
- గత ఐదేళ్ల సైకో ప్రభుత్వంతో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. ప్రాజెక్టులకు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూమి ఇచ్చిన 400 మంది రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. రూ.57కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.7.5కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. జీడిపల్లి జలాశయం నుంచి పేరూరు ప్రాజెక్టుకు సాగు నీరందించే పనులను ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలో రేమండ్ సంస్థ పనులను త్వరితగతిన ప్రారంభించాలని మంత్రి టీజీ భరత్‌ను కోరారు.
- జిల్లా అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేద్దాం. అంతేకానీ పార్టీలు, పంతాలతో గొడవ పడటం సరికాదు అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ ఫ్రీకిట్లు ఇవ్వడం లేదన్నారు. భూసేకరణకు నిధులివ్వాలని, పీఏబీఆర్ డ్యాంలో వాటర్ స్టోరేజ్ పెంచడానికి నిధులు కేటాయించాలని కోరారు.

పర్యావరణ.. పూజ చేద్దాం..!




- మట్టి వినాయకులతో మేలు
- పీఓపీ, రసాయన రంగులతో ముప్పు
- నిమజ్జనం చేస్తే నీరు కలుషితం
- మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదం
- ప్రజల్లో చైతన్యం రావాలంటున్న అధికారులు

మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించి, మట్టిలో నిమజ్జనం చేస్తే.. ఏ ఇబ్బందీ ఉండదు. నీటిలో ఇట్టే కరిగిపోయి, మట్టిలో కలిసిపోతుంది. పీఓపీతో చేసిన రసాయన రంగులు అద్దిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తే.. ప్రాణాలు నిలిపే నీటిలో విషం పోసినట్లే. ఆ నీరు తాగితే ప్రాణాపాయం ఉంటుంది. అందులో దిగితే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. నీరు కలుషితమై పర్యావరణానికి ముప్పు తప్పదు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా.. పర్యావరణ పూజ చేద్దాం..

ధర్మవరంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ రానే వచ్చింది. దీంతో ఊరువాడా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. గ్రామ, పట్టణ వీధులతోపాటు ప్రతిఒక్కరూ ఇళ్లలో వినాయకుడి ప్రతిమను ఏర్పాటుచేసుకుని పూజలు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిసత్‌తో తయారు చేసి, రసాయన రంగులు అద్దిన వినాయకుల బొమ్మలను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాం. వీటివల్ల పర్యావరణం దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేస్తే కేవలం మట్టి మాత్రమే వాడటం వల్ల పర్యవరణానికి, మూగ జీవాలకు ఎటువంటి హాని ఉండదని వారు అభిప్రాయపడుతున్నారు. రసాయన రంగులు వాడిన వినాయక విగ్రహాలతో గ్రామ, పట్టణ సమీపాల్లోని చెరువులు, వంకలు, వాగులు, కుంటలు, చెక్‌డ్యాంలలో నిమజ్జనం చేస్తారు. రంగులు.. ఆ నీటిలో కలిసిపోతాయి. విగ్రహం కరగడానికి చాలా రోజులు పడుతుంది. ఆ నీటిని మూగజీవాలైన గొర్రెలు, మేకలు, ఆవులు, వన్యప్రాణాలు తాగితే రోగాలు బారిన పడి చనిపోయే ప్రమాదం ఉందని పశువైద్యాధికారులు తెలుపుతున్నారు. ఆ నీటిలో చిన్నారులు దిగి ఈతకొట్టినా అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. రంగుల నీటి కారణంగా కొలను చుట్టూ చెట్లు కూడా చనిపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మట్టి వినాయకులను పూజించి, నిమజ్జనం చేస్తే తొందరగా కరిగిపోతాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని నిపుణులు చెబుతున్నారు. కావున, మట్టి వినాయకులనే పూజిద్దామని పలువురు పిలుపునిస్తున్నారు.

అందుబాటులో మట్టి వినాయకులు

రూ.100 నుంచి రూ.500 వరకు ధరల్లో మట్టివినాయకులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా తక్కువ ధరకే మట్టిగణపయ్యలు ఉన్నాయని నిర్వహకులు తెలుపుతున్నారు

కలర్ నీళ్లు తాగితే ప్రాణహాని



రసాయన రంగుల వినాయకులను గ్రామాల సమీపంలో నిమజ్జనం చేసినపుడు కుంటలు, వంకల్లోని నీరు కలుషితమవుతుంది. ఆ నీటిని మూగ జీవాలు తాగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో ప్రాణహాని కూడా కలగవచ్చు. మట్టి వినాయకులను పూజించడమే మంచిది.

- డాక్టర్ శేఖర్, పశువైద్యాధికారి, చింతలపల్లి పశువైద్యశాల

అవగాహన కల్పిస్తున్నాం..



గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మట్టి వినాయకులతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కుంటలు, చెక్‌డ్యాంల లో రసాయన రంగులతో కూడిన విగ్రహాలను నిమజ్జ నం చేస్తే ఆ నీరంతా కలుషితమై మూగజీవాలకు, చె ట్లు దెబ్బతిని పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలి.

- సాయిమనోహర్, ఎంపీడీఓ, ధర్మవరం

కలుషిత నీటితో అనారోగ్యం



రంగుల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసిన కుంటలు, చెరువుల్లో ఈతకొడితే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. రసాయన రంగులు నీటిలో కలుషితమవుతాయనీ, తద్వారా పిల్లలు దిగితే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. నిమజ్జనం చేసిన నీటిలోకి పిల్లలు ఎవరూ దిగరాదు. మట్టి వినాయకులను పూజించి పర్యవరణాన్ని కాపాడుకుందాం.

- డాక్టర్ పుష్పలత, వైద్యాధికారి, దర్శినమల

మట్టి విగ్రహాలనే విక్రయిస్తాం



మార్కెట్‌లోకి ఎన్ని రకాల రంగుల వినాయక బొమ్మలు వచ్చినా.. మేము మాత్రం ఏటా మట్టి విగ్రహాలనే విక్రయిస్తాం. ఏళ్లుగా దీనిని పాటిస్తున్నాం. గతంలో అందరూ మట్టివినాయక విగ్రహాలను కొనుగోలు చేసి, పూజించేవారు. ప్రస్తుతం రంగుల బొమ్మలు కొంటున్నారు. దీంతో చాలా సమస్యలు తప్పవు.

- సుశీలమ్మ, కేతిరెడ్డికాలనీ, ధర్మవరం

ఈఓకు సమస్యల సవాలు



కసాపురం దేవస్థానం

- అధ్వానంగా వసతి గదుల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా సిబ్బంది విధులు
- నెట్టికంటి ఆలయంలో పడకేసిన అభివృద్ధి



ఆలయం ఎదురుగా రోడ్డును ఆక్రమించిన అంగళ్లు

గుంతకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సమస్యలు పేరుకుపోయాయి. దేవస్థానంలో ఇప్పటిదాకా విధులను నిర్వర్తించిన ఈఓలు చాలా వరకు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారు. స్థానికంగా ఉండకపోవడం, ఉన్నా ఆలయ పాలనపై దృష్టి సారించకపోవడం, సిబ్బందిని సక్రమంగా పనిచేయించుకోలేకపోవడంతో సమస్యలు పెరిగిపోయాయి. ఈఓలు స్థానికంగా ఉండకపోవడంతో ఏఈఓ, సూపరింటెండెంట్ల పైనే భారం పడుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓల నిర్లక్ష్యం కారణంగా ఆలయంలో అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. సిబ్బంది కూడా మాట వినని పరిస్థితికి చేరుకున్నారు. కనీసం కాంట్రాక్టు ఉద్యోగులను కూడా సక్రమంగా పనిచేయించలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఈఓ విజయ రాజుకు సమస్యలు సవాలుగా నిలిచాయి. ఉరుకుంద వీరణ్ణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పథంలో నడిపారన్న పేరున్న ఆయన ఇక్కడ ఏమేరకు వ్యవహారాన్ని చక్కబెడతారన్న ఆసక్తి నెలకొంది.

వసతి గదుల నిర్వహణ అధ్వానం

ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతి గదుల నిర్వహణ అధ్వానంగా మారింది. గదులు దుర్గంధభరితంగా ఉన్నాయంటూ భక్తులు ఆరోపిస్తున్నారు. గదుల బయట కూడా పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉంది. రామదూత నిలయంలో ఏసీలను సక్రమంగా నిర్వహించడం లేదంటూ 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా హుటాహుటిన కొన్నింటికి మరమ్మతులు చేయించారు. హాళ్లలో వివాహాది శుభకార్యాలు చేసుకునే భక్తులను సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆలయం ఎదుట ఉన్న దుకాణాలతో భక్తులకు సమస్యలు తలెత్తుతున్నాయి. దుకాణాలవారు వారి పరిధికి రెండింతల దూరం ముందుకు జరిగి వస్తువులను ఉంచుతుండటంతో సమస్యగా మారింది. ముఖ్యంగా శనివారాల్లో ప్రాకారోత్సవంలో పాల్గొనడానికి భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడుతారు. నిలబడడానికి కూడా చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. అంగళ్ల ముందు నిలిచిన భక్తులపై దుకాణదారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దుకాణాలను దూరంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఇరవై ఏళ్లుగా అలాగే ఉంది.

అభివృద్ధి ముందుకు సాగేనా..?

కసాపురం నుంచి డ్రెయిన్ల మురుగునీరు ఆలయం వెనుక వైపు నుంచి వెళుతుండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దాన్ని గ్రామంలోని సచివాలయం వైపుగా ఆలయానికి దూరంగా మళ్లించాల్సి ఉంది. ఆలయం బయట సరైన భవనాల్లేక లోపలే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం లోపలే వడమాల, లడ్డూ తయారీ వంటశాలను, శనగల పిండిమరను నిర్వహిస్తున్నారు. అంగళ్లను తొలగించి దూరం నుంచే ఆలయ ముఖద్వారం కనిపించేలా చేయడానికి, రెండో ప్రాకారం తయారీకి, గోపురాలకు బంగారు కలశాల ఏర్పాటు, తదితర ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. ఈఓ విజయరాజు పనిచేసిన చోట్ల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టారన్న పేరుంది. కసాపురంలో కూడా అదేవిధంగా కార్యాచరణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

గదుల నిర్వహణ అధ్వానం



కసాపురం దేవస్థానానికి చెందిన వసతి గదుల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. గదులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. గదుల బయట కూడా అపరిశుభ్రత నెలకొంది. ఆలయంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉన్నా భక్తులకు వసతి, సదుపాయాలను కల్పించకపోవడం శోచనీయం.

- ఎం. లక్ష్మీనారాయణ, గుంతకల్లు

సిబ్బందికి డ్రెస్‌కోడ్ తప్పనిసరి



కసాపురం దేవస్థానంలో భక్తులకు వసతులు, సేవలందించడంలో సిబ్బంది ఘోరంగా విఫలమవుతున్నారు. పెద్ద సంఖ్యలో ఆలయ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నా ఎవరు ఉద్యోగులో తెలియని పరిస్థితి ఉంది. సిబ్బందికి డ్రెస్ కోడ్‌ను తప్పనిసరి చేస్తే భక్తులకు ఏదైనా అసౌకర్యం కలిగితే వారిని ప్రశ్నించడానికి, ఫిర్యాదు చేయడానికి వీలవుతుంది.

- కొలిమి రామాంజనేయులు, గుంతకల్లు

కష్టపడ్డ వారికే పదవులు



కమిటీల నియామకంపై కసరత్తులో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులతో త్రిసభ్య కమిటీ మంతనాలు


(5వ పేజీ తరువాయి)

పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్‌రాజు, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ఏడీసీపీటీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్, హిందూపురం టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సామకోటి ఆదినారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ జిల్లా, మండల కమిటీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో చోటు దక్కడంపై సభలో అభినందలు తెలిపారు.

జిల్లా అధ్యక్ష పదవికి.. పోటాపోటీ

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి ఆ సారి గట్టిపోటీ నెలకొంది. పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ నియామకంపై ఏర్పాటైన త్రిసభ్య కమిటీకి ఆశావహులు దరఖాస్తులు ఇచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం తాము పడిన కష్టాన్ని కమిటీ సభ్యులకు తెలిపారు. ఎంపికపై జిల్లా నేతలతోపాటు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలతో త్రిసభ్య కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. జిల్లా అధ్యక్ష పదవికి 17 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కుంటిమద్ది రంగయ్య, ధర్మవరం ఫణికుమార్, పుట్టపర్తి సామకోటి ఆదినారాయణ, వడ్డెర సాధికార కన్వీనర్ వెంకట్, కురుబ క్రిష్ణమూర్తి మరో 10 మంది దరఖాస్తు చేశారు. జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వెల్లడైన నాయకుల అభిప్రాయాలను నివేదికగా పార్టీ అధినేత చంద్రబాబుకు అందజేస్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు తెలిపారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా అందరు కట్టుబడి ఉండాలని వారు కోరారు.

నిరంతర నిఘా..!



కెమెరా కళ్లలో నగర ప్రధాన వీధులు

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలతో జాతీయ రహదారులు, రాష్ట్ర, జిల్లా రహదారుల కలిసే చోట కూడా రోడ్ పాయింట్ వ్యూ కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎస్పీ జగదీష్ ఇచ్చిన స్ఫూర్తితో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద మోబిస్ ఇండియా మాడ్యూల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 33 లక్షలు విలువైన అధునాతన సోలార్ బేస్డ్ సీసీ కెమెరాలు 300 వితరణ చేసింది. డిపార్టుమెంట్‌లోని సీఐలు, ఎస్‌లు సైతం ఇదే స్ఫూర్తితో తాము పనిచేసే ప్రాంతాల్లో మరో 150 వరకూ కెమెరాలను సొంతంగా ఏర్పాటు చేయించారు. అలాగే జిల్లాలో 1371 ప్రార్థనా మందిరాల వద్ద 3,601 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. జిల్లాలోని పలు విగ్రహాలు 350 వరకూ ఉంటే అవి కవర్ అయ్యేలా 74 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

జిల్లా కేంద్రంలో...

జిల్లా కేంద్రమైన అనంతపురం నిత్యం రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు, ప్రజలు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఈ క్రమంలో రద్దీ ప్రదేశాలు, జన సమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో దొంగలు, నేరగాళ్లు నేరాలకు పాల్పడే అవకాశాలుంటాయి. అలాంటి వాళ్లపై నిరంతరం నిఘా పెట్టడానికి నగరంలోని కీలక పాయింట్లలో పోలీస్‌శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన 56 సీసీ కెమెరాలను అనంతపురం నగరంలోని ప్రధాన కూడళ్లు, సర్కిళ్లు, ప్రధాన రహదారి జంక్షన్లలో ఏర్పాటు చేయించారు.

సీసీ కెమెరాలే కీలక సాక్ష్యాలు..

చాలా కేసుల్లో సీసీ కెమెరాలు కీలక సాక్ష్యాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా దొంగలను పట్టుకోవడానికి క్లూస్ ఇవ్వడమేకాకుండా, అనేక మిస్సింగ్ కేసుల్లోనూ కీలక ఆధారాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, విద్యార్థులు, మహిళల మిస్సింగ్ కేసులను ఛేదించడంలో పోలీసులకు సీసీ కెమెరాలు చాలా ఉపయోగ పడుతున్నాయి. ఈ నెల 11 కమలానగర్‌కు చెందిన రెండు కుటుంబాలకు చెందిన 5వ తరగతి, 7వ తరగతి, 8వ తరగతి చదివే పిల్లలు ఉదయం 9 గంటలకు స్కూల్ వెళ్లకుండా మిస్ అయితే వన్‌టౌన్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా 2 గంటల్లోనే పిల్లలను గుర్తించారు. ఇలాంటి కేసుల ఛేదింపులో సీసీ కెమెరాలు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. ఇలా ఇప్పటి వరకూ కేవలం సీసీ కెమెరాల ఆధారంగానే 40 నుంచి 45 ప్రధాన కేసులను ఛేదించినట్లు జిల్లా పోలీస్‌శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

నెట్టికంటి హుండీ ఆదాయం రూ.85.99 లక్షలు

గుంతకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ.85.99 లక్షల ఆదాయం లభించిందని ఆలయ అధికారులు తెలియజేశారు. సోమవారం ఉదయం ఆలయ ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఎండోమెంటు పరిశీలకురాలు రాణి సమక్షంలో హుండీలను తెరిచారు. సాయంత్రం వరకూ భక్తుల వితరణ సొమ్మును లెక్కించగా ప్రధాన హుండీల ద్వారా రూ.85.74 లక్షలు, అన్నదాన హుండీ ద్వారా రూ.25,063 లభించాయని తెలియజేశారు. 39.900 గ్రాముల బంగారం, 2.4 కేజీల వెండి సమకూరిందన్నారు. గత 70 రోజుల్లో ఆలయానికి సమకూరిన ఆదాయం ఇది అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశ్వర్లు, సిబ్బంది రాఘవేంద్ర, సీతారాముడు, వేమన్న పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

క్రైం కార్నర్

రాలిన మరో నేతన్న


చౌడయ్య మృతదేహం

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అప్పులకు మరో నేతన్న బలయ్యాడు. పట్టణంలోని శివానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు పామిశెట్టి చౌడయ్య(60) అప్పుల బాధ భరించలేక సోమవారం ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌడయ్య కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. మగ్గం గిట్టుబాటు కాక కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఇటీవల వర్షాలు కురవడంతో మగ్గం పని సాగలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించగా.. అప్పటికే అతడు మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, శవాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చౌడయ్యకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు సంజీవరాయుడు, కుమార్తె జయలక్ష్మి ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రాణంతీసిన చేపల వేట సరదా

● చెరువులో మునిగి బేల్దారి మృతి


రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బేల్దారి ప్రాణం తీసింది. చేపల పట్టేందుకు వెళ్లి ధర్మవరం చెరువులో మునిగి బేల్దారి సాకే రామాంజనేయులు (40) మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ఆదివారం ధర్మవరం చెరువు వద్దకు చేపలు పట్టేందుకువెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి, ఊపిరాడక మరణించాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో పట్టణంలోనే ఉన్న అతడి అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి ఉంటాడని భార్య లక్ష్మీనరసమ్మ భావించింది. సోమవారం ఉదయం చెరువు వైపు వెళ్లిన వారు.. రామాంజనేయులు మృతదేహం తేలియాడుతుండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీశారు. ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. రామాంజనేయులుకు కుమారుడు సాయిలక్ష్మణ్, కుమార్తె నవతలక్ష్మి ఉన్నారు.

సైబర్ మోసం.. రూ.94 వేలు హాంఫట్


మోసపోయిన దంపతులు అంజినప్ప, భాగ్యమ్మ

రొద్దం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజినప్ప భార్య భాగ్యమ్మ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.94 వేలు కొట్టేశారు. భాగ్య మ్మ మొబైల్‌ను ఆదివారం అర్ధరాత్రి ఆమె కుమారుడు నాగార్జున వాడుతుండగా సైబర్ నేరగాళ్లు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పారు. వారు చెప్పినట్లు చేయడంతో పలు దఫాలుగా మొత్తం రూ.94వేలు ఖాతా నుంచి మాయమైంది. తల్లిదండ్రులు తిడతారన్న భయంతో నాగార్జున ఇంట్లో నుంచి పరారయ్యాడు. ఉదయం డబ్బు పంపించేందుకు ప్రయత్నించగా.. అకౌంట్‌లో సున్నా నిల్వ అని చూపడంతో వెంటనే బ్యాంకుకు వెళ్లారు. నగదు మాయమైన విషయాన్ని ఫిర్యాదు చేయగా.. సైబర్ నేరగాళ్లు లాగేసుకున్నారనీ, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు.

ప్రాణం తీసిన ప్రేమ

సూటిపోటి మాటలతో మనస్తాపం.. స్వాతి ఆత్మహత్య


స్వాతి (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రేమ.. యువతి ప్రాణాలు బలి తీసుకుంది. 'మా ప్రేమకు నువ్వే అడ్డుగా ఉన్నావ్. నువ్వే చనిపోతే... ఇబ్బందులు తొలగిపోతాయ్' అంటూ ప్రేమికులు.. స్వాతిని సూటి పోటి మాటలతో వేధించారు. దీంతో 22 ఏళ్ల స్వాతి తను ఉంటున్న స్థానిక సాయినగర్‌లోని హాస్టల్ గదిలోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సీఐ శ్రీకాంత్ యాదవ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొందిపల్లికి స్వాతి నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండేది. సాయినగర్‌లోని దీపు బ్లడ్ బ్యాంకులో ల్యాబ్ టెక్నీషియన్‌గా కూడా పనిచేస్తుండేది. అక్కడే ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్న అరుణ్.. మరో యువతి ప్రతిభా భారతిని ప్రేమిస్తున్నాడు. అరుణ్ ఆమెతోపాటు, స్వాతిని కూడా ప్రేమించాడు. ప్రతిభా భారతి విషయం తెలుసుకుని స్వాతి దగ్గరకు వచ్చి... 'నేను, అరుణ్ ఎప్పటి నుంచో ప్రేమించుకుంటున్నాం, మా ప్రేమకు నువ్వే అడ్డువస్తున్నావ్. ఈ విషయాన్ని ల్యాబ్‌లో, హాస్టల్‌లో చెబుతా. నువ్వు చనిపోతే... మాకు ఇబ్బందులు తొలగుతాయి' అంటూ హెచ్చరించింది. దీంతో స్వాతి మనస్తాపం చెంది ఉదయం 7.30 గంటలకు తాను ఉంటున్న బాలాజీ హాస్టల్‌లో తన చున్నీతోనే ఉరివేసుకుంది. గమనించిన స్నేహితులు.. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పూజారి నాగభూషణం ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది బాహాబాహీ

● విరిగిన కార్యదర్శి చేయి

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో విధి నిర్వాహణ విషయంలో పంచాయతీ కార్యదర్శి ఫారూక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ సోమవారం బాహాబాహీకి దిగారు. దీంతో కార్యదర్శి చేయి విరిగింది. కమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో సర్వేకోసం కార్యదర్శి ఫారూక్, క్లాప్‌మిత్ర రామన్న వెళ్లారు. సర్వేలో సర్వేయర్, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొనాల్సి ఉంది. వారు రాకపోవడంతో ఆలస్యంగా వచ్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను కార్యదర్శి ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. కార్యదర్శి. మండలపరిషత్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఇరువురు ఘర్షణకు దిగారు. కిందపడ్డ కార్యదర్శి ఫారూక్ ఎడమచేయి విరగడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. ఘర్షణపై పోలీసులు ఆరాతీశారు. ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజీ, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు విషయం వివరించారు. కాలనీలో ఒకరికొకరు చెప్పులతో కొట్టుకున్నట్లు బాలాజీ తెలిపారు. ఘర్షణపై ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.


దాడిలో గాయపడిన కార్యదర్శి ఫారూక్


ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ

డీపీఓను వెంటాడుతున్న గతం

● నాటి తప్పిదాలతో సతమతం
● సంజాయిషి ఇచ్చుకోవడానికి పక్క జిల్లా పర్యటనలు
● సీనియార్టీ జాబితాలో తిరకాసు
● కలెక్టర్ చుట్టూ ప్రదక్షిణ



ఉద్యోగోన్నతుల జాబితాలో గందరగోళం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏమి జరుగుతోందో అంతచిక్కడం లేదు. డీపీఓ నాగరాజనాయుడును వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలు వెంటాడుతున్నాయి. దీంతో ఆయన ఇక్కడ సరిగ్గా విధులు నిర్వర్తించలేకపోతున్నారని ఆ శాఖలో చర్చ జరుగుతోంది. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తిరకాసు పెడుతున్నారని సమాచారం. కలెక్టర్ వద్దకు ఫైల్ వెళ్లడం, తిరిగి రావడం షరా మామూలుగా మారింది. డీపీఓ కార్యాలయ సిబ్బంది తయారు చేసిన సీనియార్టి జాబితాలో రోస్టర్‌కు విరుద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో మరోసారి జాబితా మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. డీపీఓ నాగరాజనాయుడు వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలకు ప్రస్తుతం సంజాయిషీ ఇవ్వడానికి పక్క జిల్లాకు వెళుతున్నట్లు తెలుస్తోంది. పనిరోజుల్లో మరో జిల్లాకు వెళ్లాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. డీపీఓ అదే మార్గంలో ఏదో ఒక పంచాయతీని తనిఖీలు చేపట్టి, ఎలాంటి అనుమతులు లేకుండానే సంజాయిషీ ఇచ్చుకోవడానికి మరో జిల్లాకు వెళుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యంగా సంజాయిషీ కోసం తిరుగుతున్న ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.

జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు నెలన్నర క్రితం ఉద్యోగోన్నతి కల్పించి డిప్యూటీ ఎంపీడీఓలుగా నియమించారు. దీంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కీలకం. వెంటనే అర్హుల జాబితా సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదం కోసం తిరుగుతున్నారు. ఈలోపే గ్రేడ్-4 కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. తర్వాత ప్రకటించిన సీనియార్టి జాబితాలో తిరకాసు ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. రోస్టర్ సరిగా అమలు చేయకపోవడంతో కలెక్టర్ చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. దీంతో కొత్త సమస్య మొదలైంది. ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తయారు చేసిన జాబితాలోనే తప్పులు ఉన్నాయి. పదుల సంఖ్యలో ఉద్యోగోన్నతులు కల్పించడానికి సిద్ధం చేసిన జాబితాలో దాదాపు 10 మంది వరకు డిపార్ట్‌మెంట్ టెస్టులు పూర్తి చేయని గ్రేడ్-4 కార్యదర్శులకు అవకాశం కల్పించారన్న చర్చ జరుగుతోంది. ఇంకా ఎన్ని తప్పులు ఉంటాయోనని డీపీఓను కలెక్టర్ పలు మార్లు తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనుభవం లేనివారితో జాబితా తయారు చేయడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పనుల్లో కాలయాపన జరుగుతోంది.

టమోటా కిలో రూ.28

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.28తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరిధర రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1208 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను ఏడీఏ పరిశీలించారు. జిల్లాకు డీఏపీ 815 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 207 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పీజీ డిప్లొమా కోర్సు ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వీసీ ఆచార్య అనిత విడుదల చేశారు. ఫ్రెంచ్ 20మంది, జర్మన్ 19మంది, స్పానిష్ కోర్సులో 16 మంది మొత్తం 55మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆర్డీటీ సహకారంతో కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల కంట్రోలర్ శ్రీరాములు నాయక్, ఆర్డీటీ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రిన్సిపాల్ గీతాంజలి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారి కాలనీకి చెందిన శ్రీరాములు(49) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరాములు, మల్లీశ్వరి దంపతులకు పిల్లలు లేరు. శ్రీరాములు నగరంలోని సెలూన్ షాపుల్లో పనిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఇంటి బయట వాష్‌రూమ్ వద్ద ప్లాస్టిక్ వైర్‌తో ఉరేసుకుని, మరణించాడు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములుకు రూ.5లక్షల వరకూ అప్పులున్నాయనీ, అధిక వడ్డీల భారం భరించలేకే ప్రాణం తీసుకున్నాడని తెలుస్తోంది.

అధిక వడ్డీ వేధింపుల వల్లే...

అధిక వడ్డీల వేధింపుల వల్లే శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని అధిక వడ్డీల వ్యతిరేకపోరాట కమిటీ అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శ్రీరాములు మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. మృతుడి కుటుంబీకులతో మాట్లాడారు. నగరంలో అధిక వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక అమాయకులు పిట్టల్లా రాలుతున్నా... పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా అవార్డులు అందజేస్తామన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అవార్డులకు జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, ఎయిడెడ్ స్కూళ్లు, ఏపీఎంస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్ కేజీబీవీ, డైట్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు రెండు సెట్లను 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఇవీ అర్హతలు..: కనీసం 10 సంవత్సరాలు బోధన అనుభవం ఉండాలి. గతంలో జిల్లాస్థాయిలో అవార్డు అందుకున్న వారు అనర్హులు. అవార్డుకు దరఖాస్తు చేసుకునే వారిపై క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. రాష్ట్ర అవార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు అనర్హులు.

కుమారుడి ముందే తండ్రి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచం అంతమైనా నేను చావను. నేను చిరంజీవిని' అంటూ మండలంలోని నామాల గ్రామానికి చెందిన పాళ్యం ఆంజనేయులు(64) సోమవారం కుమారుడి ముందే విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంజనేయులు మానసిక స్థితి సరిగా లేదు. 30ఏళ్లుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పెద్ద కుమారుడు వెంకటేశ్ ముందే మొదట కొన్ని విషపు గుళికలు మింగాడు. ఆ తరువాత మరికొన్ని మింగుతుండగా అడ్డుకుని వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆంజనేయులుకు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫెన్సింగ్ జట్టు ఎంపిక


ఎంపికైన ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పావతి ప్రకటించారు. బాలురలో సాయిసాత్విక్ రెడ్డి, వెంకట హర్షవర్ధన్‌రావు, సుశాంత్‌కృష్ణ, స్నేహిత్‌సింహ, ఆహిల్, రియాజ్‌సూరజ్, ఆంజనేయసాయి సూర్య, మిలింద్‌యాదవ్ ఉన్నారు. బాలికల విభాగంలో అన్సీఖదీజా, వందన, అమృత, లిఖితచౌదరి, చేతన, శరణ్యతేజ, తన్విత, వ్యాహిత ఎంపికయ్యారు. వీరు ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు లక్ష్మి, రాహుల్, రవి పాల్గొన్నారు.

పాపను చూసి వస్తూ.. తండ్రి మృతి

● వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత
● పలువురికి గాయాలు



నజీర్, బాబాఫకృద్దీన్ (ఫైల్)

వజ్రకరూరు(ఉరవకొండ)/నల్లమాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పది రోజుల కన్నబిడ్డను చూసి వస్తూ.. తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఉమ్మడి జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. వజ్రకరూరు శివారులో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో నజీర్(20), బాబాఫకృద్దీన్(30) మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పామిడికి చెందిన బాబాఫకృద్దీన్, ఫరూక్, నజీర్ మిత్రులు. భవన నిర్మాణ కార్మికులు. బాబాఫకృద్దీన్ అత్తగారి ఊరు ఉరవకొండ కాగా, 10 రోజుల క్రితం అతడికి కుమార్తె జన్మించింది. మిత్రులతో కలిసి కుమార్తెను చూడడానికి ఉరవకొండకు వచ్చాడు. పాపను చూసి, ముగ్గురు ద్విచక్రవాహనంపై పామిడికి బయల్దేరారు. వజ్రకరూరు శివారులో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నజీర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. బాబాఫకృద్దీన్ చికిత్స పొందుతూ సోమవారం అనంతపురంలో మృతి చెందాడు. ఫరూక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ..


ముత్యాలమ్మ (ఫైల్)

మండలంలోని కంబాలపర్తి గ్రామ సమీపంలో ఎగువ బ్రిడ్జి వద్ద ఆటో బోల్తాపడి మహిళ మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. మండలంలోని కుటాలపల్లి తండా నుంచి పుట్టపర్తిలోని సాయిబాబా మందిరంలో కూలి పనులకోసం రోజూ పదిమంది ఆటోలో వెళ్లేవారు. సోమవారం కూడా స్వగ్రామం నుంచి ఆటోలో పదిమంది, డ్రైవర్ ఉదయం బయలుదేరారు. కంబాలపర్తి సమీపంలో ఎగువ బ్రిడ్జి వద్దకు రాగానే బోల్తా అదుపుతప్పి, బోల్తాపడింది. ప్రమాదంలో ముత్యాలమ్మ (45) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన వారిని 108లో నల్లమాడ ఆస్పత్రికి తరలించారు. మంగమ్మ, ఆమె భర్త రామచంద్రనాయక్, శివమ్మను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేంద్రరెడ్డి, మహేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ముత్యాలమ్మ మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త శీనానాయక్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభిమాన సిత్రం..!



మంత్రి చిత్రంతో నేసిన చీర

సోమందేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇంద్రా నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చింతా రవీంద్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చిత్రంతో పట్టు చీరను నేశాడు. గతంలో అనేక డిజైన్లతో చీరలను నేసిన రవీంద్ర.. కూటమి ప్రభుత్వం చేనేతలకు అమలు చేస్తున్న పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ఉచిత విద్యుత్ పథకం, 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, చేనేత నేస్తం, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు చేనేతలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. అందుకే ఆ శాఖ మంత్రికి అరుదైన కానుకను ఇవ్వాలని భావించాననీ, సోమందేపల్లిలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత హామీ ఇవ్వడంతో ఆమె చిత్రంతో చీరను నేశానని తెలిపారు. త్వరలో మంత్రి సవితకు అందిస్తానని తెలిపారు.

సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

వజ్రకరూరు(ఉరవకొండ), ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌లో జాతీయస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాను కలెక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి, అభినందించారు. భారత నాణ్యతా మండలి దేశంలోని సర్పంచ్‌లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్పంచ్ సంవాద్ పోటీల్లో మోనాలిసా పాల్గొని, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

మార్కులు బహిర్గతం చేయాలి: యూటీఎఫ్

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయాలని కలెక్టర్ చేతన్‌కు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు వారు హాజరై వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ కింద పది రకాల పోస్టులకు ఈ నెల 21న 34 మందికి ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. వీరికి 85 మార్కులకుగాను ఎన్ని మార్కులు వచ్చాయో బహిర్గతం చేయకుండా 15 మార్కులకు ఎస్ఎస్ఏ, విద్యాశాఖ అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. ఇందులో రాజకీయ ఒత్తిళ్లతో అనుభవంలేని వ్యక్తులకు ఈ పోస్టులు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని కలెక్టర్‌కు తెలియజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు ఐదేళ్ల కనీస అనుభవం లేకున్నా ఈ పోస్టులను ఇచ్చి, అర్హులకు అన్యాయం చేశారని కలెక్టర్‌కు వివరించారు. మార్కుల ను బహిర్గతం చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఇందుకు సంబంధించిన ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఈ జట్టు ఈనెల 30న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లక్ష్మి, సురేఖ, మౌనిక, ధరణి, నాగప్రసన్నలక్ష్మి యాదవ్, లావణ్య, పల్లవి, మూర్ష్రిత, రాధిక, ధరణి, బసంతి, కస్తూరి, శ్రావణి, జాహ్నవి, సుప్రియ, రిష్మిత జట్టులో చోటు సంపాదించుకున్నారు. స్టాండ్‌బైలుగా నేహ, సౌమ్య, అక్షిత, వైష్ణవి ఎంపికయ్యారు. సెలెక్షన్స్‌లో ఆర్డీటీ స్పోర్ట్స్ గ్రాసరూ ట్ డైరెక్టర్ వంశీకృష్ణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు, పీడీలు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు దక్కాయి. నగరానికి చెందిన హంజాహాస్సేన్ ఓపెన్ విభాగంలో బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించాడు. అనంతపురం నగరానికి చెందిన ఎక్కలూరు అమీనాతాజ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

తనకల్లు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ వ్యక్తిని ఏమార్చి సెల్‌ఫోన్‌ను దుండగులు సోమవారం లాక్కెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎగువతొట్లిపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి పండుగ సరుకుల కోసం తనకల్లుకు వచ్చాడు. సరుకులు తీసుకుని, ద్విచక్రవాహనంలో బైక్‌పై బయల్దేరాడు. మండలంలోని బొమ్మలకుంట సమీపంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గోపాల్ రెడ్డి వాహనానికి ఏదో తగులుకుందని చెప్పారు. దీంతో అతడు వాహనం ఆపి, కిందికి దిగి పరిశీలించడానికి వంగగానే జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐటీఐ మిట్ట సమీపాన ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి.. రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేసులు తెలిపారు. ఘటనా స్థలంలో ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదుచేసి, మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉంటుందనీ, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు బనియన్, కాఫీ కలర్ ప్యాంటు వేసుకున్నాడన్నారు. ట్రైన్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. సంబంధికులు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

న్యూస్ బాక్స్

పాలపాటిదిన్నె ఆలయ హుండీ లెక్కింపు

నల్లచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కించినట్లు ఈఓ మురళీక్రిష్ణ తెలిపారు. శ్రావణమాసం ఐదు వారాలకు హుండీ ఆదాయం రూ.6,20,700 వచ్చింద న్నారు. లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ముడిపట్టుపై అవగాహన

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముడిపట్టు నాణ్యత, ఉత్పత్తుల వైవిధ్యంపై ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ సహకారంతో శాస్త్రవేత్త, జోనల్ ఆఫీసర్ సంజీవన్‌గుప్త సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం లోని సెరికల్చర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిపుణులు ముడిపట్టు నాణ్యత వల్ల అల్లిక, పనితీరుపై ప్రభావాన్ని వివరించారు. సెరికల్చర్ అధికారి జావేద్ బాషా, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారులు సుబ్బానాయుడు, శీనానాయక్ పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌కు ఆర్యవైశ్యుల సన్మానం



మంత్రి టీజీ భరత్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కొత్తచెరువుకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు మండల కేంద్రంలో సోమ వారం సన్మానించారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో జరిగిన హిందూపురం పార్లమెంట్ సమన్వయ సమావేశానికి మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. ఆయన అనంతపురం నుంచి పుట్టపర్తికి వెళ్తున్న సమయంలో దారి మధ్యలో కొత్తచెరువులో ఆర్యవైశ్య సంఘం నాయకులు పూమాలలువేసి శాలువాతో సన్మానించారు. జిల్లా కేంద్రం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రిని వారు కోరారు. కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో మౌలిక వనరులను గుర్తించి, అనుగుణంగా టెక్స్‌టైల్స్ తదితర కంపెనీలను తీసుకురావాలని మంత్రిని కోరామని వారు తెలిపారు.

జేవీవీ జిల్లా కమిటీ ఎంపిక



అధ్యక్ష, కార్యదర్శులు బాలే నరసారెడ్డి, లోకేశ్

ధర్మవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీని స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం జరిగిన జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు జేవీవీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షులుగా డాక్టర్ టీఎం బషీర్, డాక్టర్ ఈటీ రామ్మూర్తి, వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా బాలెం నరసారెడ్డి(కదిరి), ప్రధాన కార్యదర్శిగా లోకేశ్(ధర్మవరం), కోశాధికారిగా డాక్టర్ ఆదిశేషు (ధర్మవరం) ఎంపిక చేశారు. అలాగే ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, గౌస్‌లాజం, రామకృష్ణ, కార్యదర్శులుగా నారాయణస్వామి, మహేంద్రరెడ్డి, మంజుల, ఎంకే నబీని ఎంపిక చేసినట్లు తెలిపారు.

నేత్ర దానం చేయండి

● జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి

తాడిమర్రి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి అనూరాధ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించా. ఈ సందర్భంగా అధికారి అనూరాధ మాట్లాడుతూ... సోమవారం నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి మృతిచెందగా ఆయన కళ్లను దానం చేసినందుకు జిల్లా అంధత్వనివారణ సంస్థ తరఫున ఆయన సతీమణిని సత్కరించారు. స్థానిక వైద్యాధికారి హరిత, ఆప్తాలమిక్ అధికారి ఉరుకుందప్ప, వైద్యసిబ్బంది రాంకుమార్, లక్ష్మీదేవి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం: దానాలలో నేత్ర దానం, రక్తదానం ఎంతో గొప్పవని కంటి వైద్యాధికారి నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలను విడుదలచేశారు. రోటరీక్లబ్, యువర్స్ ఫౌండేషన్, విశ్వదీపా సేవా సంఘం, లయన్స్ క్లబ్, విభిన్న ప్రతిభావంతుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

● డీఆర్‌ఓకు విద్యార్థి సంఘాల నాయకుల వినతి

బత్తలపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఏఐఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు నరేంద్ర పోతలయ్య, పవన్, హరిక్రిష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీల సమస్యలపై వినతి

బత్తలపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమగ్ర శిక్షలో పని చేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌పీడీ శ్రీనివాసరావు కు సోమవారం వినతి పత్రం అందించారు. విజయవాడలోని కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. సీఆర్‌ఎంటీలు సాయి, అశోక్, శివయ్య తదితరులు పాల్గొన్నారు

సురవరానికి ఘన నివాళి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ ప్రధాన కార్య దర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపట్ల ఆ పార్టీ మండల నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మండల కార్యదర్శి చలపతినాయుడు, సహాయ కార్యదర్శులు రవికుమార్‌నాయుడు, సుధాకర్, రత్నబాయి, లక్ష్మీదేవి, సుధాకర్, యల్లప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



బయ్యారెడ్డి (ఫైల్)


అమడగూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకిరేవులపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బయ్యారెడ్డి (75) సోమవారం ఆకస్మికంగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులరెడ్డి సోదరుడు. మూడురోజుల క్రితం ప్రమాదశాత్తు జారిపడి దెబ్బతగిలిందని, దానితో బాధపడుతూ మృతిచెందినట్లు తెలిపారు. టీడీపీ మండల నాయకులు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

టమోటాకు తెగుళ్ల బెడద

● వర్షాలకు దెబ్బతిన్న పంట



సాగులో ఉన్న టమోటా పంట



నల్ల మచ్చ తెగులు సోకిన కాయలు

ముదిగుబ్బ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన టమాటా పంట ఎడతెరిపి లేని వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఆకులు, కాయలపై నల్లమచ్చలు, తెగుళ్ల వ్యాపించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 1,150 ఎకరాల్లో టమోటా సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతుండగా, అనధికారికంగా మరో 500 ఎకరాల్లో సాగైంది. మే నెలాఖరు, జూన్‌లో సాగుచేసిన పంటలను ప్రస్తుతం కోత కోస్తుండగా, జూలైలో సాగైన పంటలు పూత దశలో ఉన్నాయి. వర్ష ప్రభావంతో కాయలపై నల్లమచ్చలు అధికంగా రావడంతో రైతులు మార్కెట్‌కు తరలించ లేకపోతున్నారు. అలాగే వదిలేస్తే తోట మొత్తం తెగుళ్ల వ్యా పిస్తాయని కూలీలతో కాయలు తొలగిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి టమాటా ధరలు కాస్త పెరిగాయి. 30 కిలోల బాక్సు ధర రూ. 800 నుంచి రూ. 1000 వరకు పలుకుతోంది. ముదిగుబ్బ, కదిరి ప్రాంతాల నుంచి అధికంగా మదనపల్లి టమోటా మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తెగుళ్లతో కాయ నాణ్యత తగ్గడంతో మార్కెట్‌లో తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతోందని, రానుపోను రవాణా ఖర్చులకు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు.

కాయలు తొలగిస్తున్నాం



ఎడపతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఆకు, కాయలపై నల్లమచ్చలు వ్యాపించాయి. రూ.1.50 లక్షల ఖర్చుపెట్టి ఎకరంలో టమాటా సాగు చేశా, మొదటి కోత కోయకుండానే తెగుళ్ల వ్యాపించడంతో కూలీలతో నల్లమచ్చ వచ్చిన కాయలు తొలగిస్తున్నాం. ధరలు బాగున్న సమయంలో తెగుళ్ల వ్యాపించడంతో నష్టం వాటిల్లింది.

- చక్రపాణి, రైతు, ముదిగుబ్బ

తెగుళ్లతో తగ్గుతున్న దిగుబడి



నేను దాదాపు రూ. 4 లక్షల దాకా పెట్టుబడితో మూడెకరాల్లో టమాటా పంట సాగుచేశా. తొలి దశలోనే ఆకు మచ్చ, కాయ మచ్చ, ఆకు ముడత తెగుళ్ల చుట్టుముట్టడంతో దిగుబడి తగ్గుతోంది. తెగుళ్లతో కాయ నాణ్యత తగ్గిపోవడంతో మార్కెట్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

- రామశేఖర్, రైతు, ముదిగుబ్బ

వాతావరణంలో అధిక తేమ వల్ల తెగుళ్లు

వాతావరణంలో అధిక తేమతో ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తోంది. లీటరు నీటికి 3 గ్రాముల మాంకోజేబ్ లేదా 3 గ్రాముల క్లోరో తలోనిల్ కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆశించకుండా 10 లీటర్ల నీటికి 5 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి పిచికారి చేయాలి. ఈ మందులను పిచికారి చేసే సమయంలో జిగురు కలిపితే సమర్థవంతంగా తెగుళ్లను నివారించవచ్చు.

- అమరేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి

మట్టి గణపతితో పర్యావరణాన్ని కాపాడుదాం

● పలువురు వక్తల పిలుపు



మట్టి వినాయకులతో శాంతి ఆనంద పాఠశాల విద్యార్థులు

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆవోపా జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు శీబా నగేశ్ గుప్త పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆవోపా, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పట్టణ వాసులకు పంపిణీచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... అదే రసాయనిక విగ్రహాలువాడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వాసవిమహిళా మండలి అధ్యక్షురాలు రూపారాగిణి, ఆవోపా సభ్యులు పాల్గొన్నారు. అలాగే వివేకానంద డిగ్రీ కళాశాలలో కూడా మట్టి వినాయక ప్రతిమలను ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థినిలకు కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ అందజేశారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శాంతి ఆనంద పాఠశా లలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా రసాయనాలతో తయారు చేసే వినాయక ప్రతిమలు వాడకంతో జల కాలుష్యం పెరిగిపోయి పర్యావరణం దెబ్బతింటుందని, దానికి బదులుగా ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను తయారుచేసి విద్యార్థులు స్థానికులకు అవగాహన కల్పించారు. బంకమన్నుతో సహజమైన రంగులతో వినాయకుడిని తయారుచేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలుపుతూ విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారుచేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో1 వెంకటచలపతి, ఎంఈఓ - 2 రమణప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొగ్గు రాజశేఖర్, సొసైటీ ప్రెసిడెంట్ తుమ్మల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా పింఛన్ తొలగించారు : సీపీఐ

నల్లమాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) :మండల వ్యాప్తంగా అర్హత ఉన్న దివ్యాంగుల పింఛన్లు తొలగించారంటూ సీపీఐ నాయకులు ఎంపీడీఓ ఆజాద్, తహసీల్దార్ రంగనాయకులకు సోమవారం వినతిపత్రం అందించారు. వైకల్య సర్టిఫికెట్లు వేరిఫికేషన్ కోసం ఆసుపత్రులకు రమ్మని, అరులైన దివ్యాంగులకు పింఛన్ తొలగించడం ఏమిటన్నారు. అర్హులైన వారందరికి పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు కుంచెపు చంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై సోమవారం వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ లక్ష్మానాయక్ తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న స్టాకు, రికార్డులను పరిశీలించారు. ఈ దుకాణాల్లో 10.17 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించి స్టాకులో వ్యత్యాసం రావడంతో రూ.4,47,350లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలిపివేసినట్లు ఏడీఏ తెలిపారు. ఆయన వెంట తనఖీల్లో ఏఓ ముస్తాఫా పాల్గొన్నారు.

హంద్రీనీవా పనులను పరిశీలించిన మాజీ మంత్రి



హంద్రీనీవా పనుల గురించి మాజీ మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే

కదిరి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండమనాయునిపాళ్యం వద్ద జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ పనులను మాజీ జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు సోమవారం పరిశీలించారు. ఆయన పుట్టపర్తిలో జరుగుతున్న టీడీపీ జిల్లా సమన్వయ సమావేశానికి వెళ్తూ మార్గ మధ్యలో హంద్రీనీవా కాలువను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయనకు వివరించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు బహిరంగ వేలం

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నూతన కూరగాయల మార్కెట్‌లోని షాపింగ్ - 1గది, కళాజ్యోతిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో 11వ గది నాలుగు షెడ్లకు మున్సిపల్ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కార్యాల యంలో సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించిన వేలం పాటలో పలువురు వాటిని దక్కించుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.ఈ వేలం పాటలో ఆర్వో హరీఫ్, ఆర్ఐలు రవి, శివ, ఏ-1 క్లర్క్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో పాల్గొననున్న మంత్రి

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం వివిధ వినాయక మండపాల వద్ద జరిగే పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొననున్న ట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మంత్రి 28వ తేదీన పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

పేద కుటుంబాలకు చంద్రబాబు అండ

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి ● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందుకున్న వారితో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొండంత అండగా ఉన్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 20 మంది పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 14,87,012 లక్షల చెక్కులను మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో 150 మందికి రూ. 2.55 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందచేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన జీవితాన్ని పొందాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ మండల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం చేశారని ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో కప్పలబండ గ్రామంలో చీటీల పేరుతో ఏకిల చంద్రశేఖర్ అనే వ్యక్తి తమను మోసం చేశారని గ్రామానికి చెందిన పలువురు ఎస్పీ వి. రత్నకు ఫిర్యాదు చేశారు. అతడి చేతిలో చీటీలపేరుతో రూ. లక్షలు మోసపోయామని కప్పలబండ గ్రామానికి చెందిన నారాయణ ప్ప, అనిత, కృష్ణమ్మ ఎస్పీకి వివరించారు. చీటి కాలం ముగిసి నాలుగేళ్లైనా ఎత్తిన చీటి మొత్తం ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. డబ్బులు అడిగితే నానా దుర్భాషలు ఆడుతున్నాడని వాపోయారు. స్పందించిన ఎస్పీ అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

● సీపీఎం నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, పేదలు

కదిరి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని నివాసాలుంటున్న పేదలకు ఇంటిస్థలా లు ఇవ్వాలని సోమవారం సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కదిరి సర్వే నెం. 720, 294లో తాత్కాలిక గుడిసెలు వేసుకుని నివాసాలున్న పేదలం దరికి ఇంటిపట్టాలు ఇవ్వాలని డిమాడ్‌చేశారు. ఇంటిస్థలాలు కేటాయిం చాలని వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు, వినతులు ఇచ్చినా... అధికారులు, ప్రభుత్వం స్పందించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు వినపత్రం అందించారు. సీపీఎం నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామమోహన్, బాబ్‌జాన్, నాగేశ్వర్, దివాకర్, గుడిసెలు వేసుకున్న వారు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి : సీఐటీయూ

కదిరి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందినా, లేక రిటైర్ అయిన కుటుంబంలోని ఒకరికి మున్సిపాలిటీలో ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 2023లో జీఓ 39 జారీ చేసినా, దానిని కదిరి మున్సిపాలిటీలో అమలు చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ, బాబ్‌జాన్, రామమోహన్, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు జనార్ధన్, తిరుపాల్, బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

● ఉత్సవ కమిటీల సమావేశంలో పోలీసులు



సాయి ఆరామంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి రూరల్/ధర్మవరం/కదిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ వినాయక ఉత్సవ కమిటీ, పీస్ కమిటీలకు సూచిం చారు. ఎస్పీ వి. రత్న ఆదేశాల మేరకు ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో పుట్టపర్తిటౌన్, పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. సీఐలు శివాంజనేయులు, సురేష్‌కుమార్, ఎస్సైలు లింగన్న, కృష్ణమూర్తి అన్నిమతాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా కళ్యాణమండపంలో సోమవారం వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గాండ్లపెంట మండలకేంద్రంలో కదరి డీఎస్పీ శివనారాయణ స్వామి వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సీఐ నాగేంద్ర, ట్రైనీ ఎస్ఐ రవికుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు. నియమ నిబంధనలను పాటిస్తూ ప్రతిఒక్కరూ వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

● ముదిగుబ్బ / నల్లచెరువు/ తనకల్లు: వినాయక చవితి వేడుకల సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ శివరాముడు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగప్రసన్న అవగాహన కల్పించారు. మండలకేంద్రంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ ఠాగూర్, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నల్లచెరువు ఎస్ఐ మగ్బుల్ బాషా మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ రఘునాథ్ గుప్త, తహసీల్దార్ జమానుల్లాఖాన్‌తో కలిసి మండలంలోని గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీటీసీ శివారెడ్డి, పంతులచెరువు సర్పంచ్ రమణారెడ్డి, లక్ష్మీపతియాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తనకల్లు పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి పండుగ నిబంధనలను ఎస్ఐ గోపి ఉత్సవ కమిటీ సభ్యులకు వివరించారు. ఎంపీడీఓ రామానాయక్, లైన్‌మ్యాన్ హరి, మహిళ పోలీసులు, పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో ఆహార పదార్థాల పరిశీలన

కదిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరబిక్ హోటల్లో కుళ్లిన, చెడిపోయిన ఆహార పదార్థాలను సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. స్థానిక అరబిక్ హోటల్లో కుళ్లిన ఆహార పదార్థాలను అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఆదివారం కమిషనర్ కిరణ్ కుమార్ తన సిబ్బందితో తనిఖీ చేశారు. అక్కడ ఆహార పదార్థాలు కుళ్లిపోయినట్లు, ఎంగిలి బిర్యానీని ఇతర కస్టమర్లకు అందిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. దీంతో సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి హోటల్‌లో ఉన్న ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. హోటల్‌లో ఉన్న ఆహార పదార్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించి, బ్లీచింగ్ చేశారు.

ఏపీటీఎఫ్ పట్టణ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ ధర్మవరం పట్టణ శాఖ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అ ధికారి సానే రవీంద్రారెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ ఉన్నతపాఠశాలలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, ఎన్నికల అధికారి సానే రవీంద్రారెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులు, బీకే ముత్యాలప్ప, బలరాముడు ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా జెన్ని నాగప్ప, అధ్యక్షుడిగా ఎన్ గోపి, ప్రధానకార్యదర్శిగా అంజినాయక్ ను ఎన్నుకున్నా రు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా నాగభూషణ, నాగశేఖర్, శిరీష, చెన్నుడు రామాంజినేయులు, కార్యదర్శులుగా బషీర్‌అహమ్మద్, విజయ్‌కుమార్, దుర్గా, కాంతమ్మ, జిల్లా కౌన్సిలర్స్‌గా ఉమాపతి, అమానుల్లా, ఓబుళేశు, కృష్ణవేణి, జగదీశ్, వెంకటరమణ, ఆడిట్ కమిటి కన్వీనర్‌గా శేఖర్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

కొనసాగిన వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ



క్రీడాకారులకు షీల్డులు అందజేస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 సోమవారం కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో డ్రాగన్ లెవెన్స్ జట్టు, సునామీ వారియర్స్‌పై 47పరుగుల తేడాతో విజయం సాధించారు. రెండో మ్యాచ్‌లో బీడీపీ యూత్ సూపర్ కింగ్స్ జట్టు ఎలెవన్ సోల్జర్స్‌పై విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో దంపెట్ల కింగ్స్ జట్టు మాస్టర్స్ లెవెన్స్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచుల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జింకా రామాంజినేయులు, నాయకులు అంగజాల రాజు, తలారి రమేష్, కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ప్రతిభ



యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరచిన ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆరో యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించినట్టు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడులో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొన్న ధర్మవరం విద్యార్థులు మమత, అభిలాష్, యుగంధర్, రఘు, చేతన్‌గౌడ్, జస్వన్‌కుమార్, భానుకేశవ్ ప్రథమ స్థానంలో నిలిచి 4 బంగారు పతకాలు, ద్వితీయస్థానంలో 2, తృతీయ స్థానంలో 4, నాలుగో స్థానంలో 3, ఐదో స్థానంలో 3 బంగారు పతకాలు సాధించారన్నారు. వారిని సోమవారం గాజుల సోమేశ్వరరెడ్డితో పాటు అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

న్యూస్ బాక్స్

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పెనుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పసరవక్కురి బావివద్దున కొత్తగా నిర్మించిన ఆలయంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదబ్రహ్మ నాగప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ, విగ్రహ దాత శ్రీనివాస రావు దంపతుల చేత ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్చారణలతో నూతన వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, పులగూర్ల శ్రీనివాసులు, కురుబ నంజుండ, బోయనంజుండ, రమణమ్మ హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభా విద్యార్థులతో విద్యాశాఖాధికారులు

పెనుకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్‌రిబ్బన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పెనుకొండకు చెందిన విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. కళాశాలకు చెందిన ఎస్.శబరీన్‌తాజ్, ఎస్.నిజాముద్దీన్, రెండోస్థానం సాధించి రూ.4వేలు నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి రెడ్ రిబ్బన్ అధికారి మునిరత్నం, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి చెన్నకేశవప్రసాద్ చేతులమీదుగా నగదు అందజేశారు. 26వతేదీన జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. విద్యార్థులను రెడ్‌రిబ్బన్ నోడల్ అధికారి జయప్రకాశ్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీఓలు, సిబ్బంది అభినందించారు.

మల్బరీ ఆకుల నాణ్యతను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు రమ్య, మురళి

రొద్దం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టు గూళ్ల నాణ్యతను పెంచాలంటే మల్బరీ ఆకుల నాణ్యతను కాపాడుకోవాలని ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రమ్య, మురళీ అన్నారు. సోమవారం బీదానిపల్లిలో ప్రాంతీయ పట్టుపరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో నా పట్టు... నా అభిమానం పేరుతో పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టు పరిశ్రమలో చికిత్స కంటే నివారణ ముఖ్యమన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత పూర్తిగా నివారించదంకష్టమని, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడీ రత్నం, ఎస్‌ఓ ఓబులేష్, పట్టు రైతులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడి మృతికి నివాళి

పెనుకొండ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో కల్లుగీత కార్మికుడు, టీడీపీ కార్యకర్త ఈడిగ నరసింహులు అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మండల మాజీ కన్వీనర్ సిద్దయ్య, శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వెంకటరాముడు, రామప్ప, శ్రీధర్‌నాయుడు, గోపాల్ నాయక్, రంగానాయక్, శంకర్, బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోమందేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున బైక్ బోల్తాపడిన ఘటనలో పెనుకొండకు చెందిన యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు హిందూపురం నుంచి ద్విచక్రవాహనంలో పెనుకొండవైపు వెళ్తున్న యువకుడు చాకర్లపల్లివద్ద మలుపులో అదుపుతప్పి బోల్తాపడినట్లు తెలిపారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ చిన్నపాటి గాయాలు కావడంతో క్షతగాత్రున్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదుచేయలేదన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న యుగంధర్, యువకులు

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం హొన్నంపల్లి సమీపంలో గుంతలోపడి మృతిచెందిన అనాథ మహిళా శవానికి టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యుగంధర్ అంత్యక్రియలు నిర్వహించారు. రెండురోజులుగా ఖననం చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ విషయాన్ని టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు యుగందర్‌కు తెలుపగా ప్రభుత్వ ఆసుపత్రిలోని మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్రక్రియలు నిర్వహించారు.

రోడ్డుపై వేలాడిన విద్యుత్ తీగలు

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై నీటి పథకం పంప్ హౌస్ సమీపం పెద్దల ఈదులవంక వద్ద సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభం విరిగి తీగలు రోడ్డుపై వాలాయి. సమీప గ్రామస్థులు పరిస్థితి గమనించి రహదారిపై వస్తున్న వాహనాలను ఆపి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శేఖర్ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులకు తెలిపారు. హిందూపురం తదితర ప్రాం తాలనుంచి భారీ వినాయక విగ్రహాలను లారీల్లో తీసుకెళ్తుండగా వాటి తాకిడికి విద్యుత్ తీగలు తగిలి స్తంభం నేలకొరిగిన ట్లు భావిస్తున్నారు. ట్రాన్స్‌కో ఏఈ క్రిష్ణ శ్రీనివాస్ సిబ్బంది ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసి నేలకొరిగిన విద్యుత్ తీగలను తొలగించి, రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. అనంతరం విద్యుత్ స్తంభం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.


రహదారిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

మొదలైన చవితి సందడి

- గణేష్ ఉత్సవాలకు మండపాలు సిద్ధం
- రేపటి నుంచి వేడుకలు
- పురంలో తొమ్మిదిరోజులు పూజలందుకోనున్న బొజ్జ గణపయ్య
- పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటు


వినాయక మండప నిర్మాణంలో కార్మికులు

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చవితి సందడి మొదలైంది. వాడవాడలా, వీధివీధిన విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు యువకులు పోటీపడుతున్నారు. చవితి రోజు పూజా సామగ్రి కొనుగోలుకు యువత తరలి వస్తున్నారు. పట్టణంలోని వీధుల్లో వినాయక మండపాల ఏర్పాట్లలో యువత నిమగ్నమయ్యారు. బుధవారం జరిగే వినాయక చవితి వేడుకకు ప్రజలు సిద్ధమయ్యారు. తొలిపూజతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. హిందూపురంలో తొమ్మిది రోజులపాటు కన్నులపండువగా నిర్వహించేందుకు గణేష్ భక్త ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేందుకు సోమవారం నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలోని హిందూపురంలో నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా సాగనుంది. ఒక పట్టణంలోనే 250దాకా విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. అందులో 10నుంచి 25అడుగుల విగ్రహాలు సుమారు వందకుపైగా ఉంటాయి. 25నుంచి 30అడుగుల విగ్రహాలు 20కిపైగా ఉంటాయి. వీటితోపాటు పట్టణ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలు మరోవందదాకా ఉంటాయి. 3, 5, 7 నిమజ్జనం చేస్తారు. కానీ ఈసారి పెద్ద విగ్రహాలు తొమ్మిదిరోజులకు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా పోలీసు లెక్కల ప్రకారం పల్లెలు, పట్టణాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

మండపాలు సిద్ధం

గతంలో పండుగరోజు సాయంత్రం వరకు వినాయక విగ్రహాల మండపాలు ఏర్పాటు చేసుకునేవారు. ఈసారి వాతావరణం అనుకూలించడంతో హిందూపురంలో సోమవారానికి 90శాతం మండపాలు సిద్ధం చేశారు. మంగళవారం మధ్యాహ్నంకే విగ్రహాలు మండపాలకు తరలించేందుకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు.

షామియానాలు, సారువ కట్టెలకు డిమాండ్

గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి మండపాలు పటిష్ఠంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం భవన నిర్మాణానికి ఉపయోగించే సారువకట్టెలను వాడుతున్నారు. ఒక్కో మండపానికి వందదాకా కట్టెలు ఏర్పాటుచేస్తున్నారు. దీనివల్ల ఒక హిందూపురం పట్టణంలోనే 20వేల కట్టెలుదాకా ఉపయోగిస్తున్నారు. హిందూపురంలో సరిపడా కట్టెలు లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రం తుమకూరు, గౌరీబిదునూరు, పావగడ నుంచి తెప్పించుకుంటున్నారు. దీంతో బాడుగల ధరలు విపరీతంగా పెంచేశారు. అలాగే టార్పాలిన్, షామియానాలు కూడా గిరాకీ పెరిగింది.

వినాయక విగ్రహాలకు పెరిగిన గిరాకీ

ప్రతియేటా వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణాల్లో విగ్రహాల తయారీదారులు నాలుగైదు నెలల ముందుగానే పనులు ప్రారంభించారు. విగ్రహాలు తయారు చేసేవారు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికే వస్తారు. ప్లాస్టాఫ్‌ప్యారీష్, మట్టి, జనపనారా, కొబ్బరిపీచుతో వీటిని వివిధరకాలుగా రూపొందించారు. ఈయేడాది వినాయక విగ్రహాలకు గిరాకీ పెరిగింది. ధరలు కూడా అమాంతంగా పెంచేశారు. ముడిసరుకు పెరిగాయని, గత యేడాదితోపోల్చితే విగ్రహం ధర 20నుంచి 30శాతం ధరలు పెంచినట్లు మండప నిర్వాహకులు అంటున్నారు.

‘అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు’


రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణాలు సీజ్‌చేస్తామని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె స్టాక్ రిజిస్టర్, అనుమతి పత్రాలు పరిశీలించి సిబ్బందికి దుకాణ యజమానులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలన్నారు. వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఎస్ఐ షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వర స్టోర్స్, సుబ్రమణేశ్వర ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు, తహసీల్దార్ శ్రీధర్, ఏఓ వీరనరేష్ సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో నిలువ ఉంచిన ఎరువులను పరిశీలించారు. రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు చేపడతామని డీలర్లను హెచ్చరించారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ సురేష్‌కుమార్, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, రాజకుల్లాయప్ప, రైతు సేవా కేంద్రం అధికారులు రుహీన, వెంకటేశ్‌బాబు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించండి

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణయ్య సూచించారు. సోమవారం మోతుకపల్లివద్ద మొక్కజొన్న పంటను పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, జిల్లా వనరుల కేంద్రం అధికారి చైతన్య, ఏడీ పరిశీలించారు. వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అనవసరంగా ఎరువులు వాడకూడదన్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఏఓ సురేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ, శాస్త్రవేత్త

ఆర్ఎంపీలతో సమావేశం


మాట్లాడుతున్న వైద్యుడు ఓంకార్

సోమందేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలతో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు ఓంకార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ల్యాబ్ నిర్వాహకులు ధరల పట్టికలను ప్రదర్శించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. సూపర్‌వైజర్ రవీంద్ర, ఆర్ఎంపీలు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఇలా వదిలేస్తే ఎలా..?

- ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు
- కొన్ని మొండి గోడలకే పరిమితం..
- రూ.లక్షల ప్రజాధనం వృథా

గోరంట్ల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని సచివాలయాలు ఏర్పాటు చేసి, భవన నిర్మాణాల విషయంలో వాటిని పూర్తి చేయాలేక ప్రజాధనం దుర్వినియోగం అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.45 లక్షల వ్యయంతో సచివాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభించగా, పక్కనే రైతు భరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌కు ప్రత్యేక భవనాలు నిర్మించతలపెట్టారు. మండలంలో 20 సచివాలయాలుండగా, గతంలో మందలపల్లి-1, బూదిలి సచివాలయాల నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించారు. మిగిలిన వాటిలో మల్లాపల్లి, గోరంట్ల, 2, 3, 4, సచివాలయ భవనాలు పూర్తి అయినా, ప్రారంభించకపోవడంతో కంపచెట్లు పెరిగి వృథాగా పడి ఉన్నాయి. భవనాలు వినియోగించకపోవడంతో అందులోని సామగ్రి శిథిలావస్థ చేరింది. ఇందులోని సంత మార్కెట్, శివాలయం, సచివాలయాలను కుట్టు శిక్షణ కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన వాటిలో 12 సచివాలయాకు రెండో స్లాబ్ వేసి అర్ధాంతరంగా పనులు ఆపివేశారు. గోరంట్ల-5 సచివాలయం, ఎమ్మార్సీ వద్దగల ప్రభుత్వ


గంగంపల్లిలో అర్ధాంతరంగా ఆగిన హెల్త్ క్లినిక్ భవనం


ప్రారంభానికి నోచుకోని మల్లాపల్లి సచివాలయం, రైతు సేవా కేంద్రం

పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్నారని, కోర్టు అభ్యంతరంతో కాంట్రాక్టర్ పనులు ఆపివేశారు. గంగంపల్లిలోనూ గ్రౌండ్‌స్లాబ్ పూర్తి చేసి వదిలేశారు. ఇక్కడున్న హెల్త్ సబ్ సెంట్ పాతభవనం తొలగించి నూతన భవనం నిర్మించాలని చేపట్టిన పనులు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. పాత భవనం ఉన్నా ప్రజలకు ఉపయోగపడటం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం మల్లాపల్లిలోని గోకుల ఆశ్రమంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. అలాగే గోరంట్ల పంచాయతీలో 5 సచివాలయాలుండగా, పట్టుపరిశ్రమ శాఖ షెడ్‌లో 1, 3 సచివాలయాలు, మిగిలినవి గ్రామ చావిడితోనూ, వ్యవసాయ శాఖ పాత గిడ్డంగి, సంత మార్కెట్ నూతన ఆర్ఎస్‌కే భవనంలో నిర్వహించాల్సి వస్తోంది. మేజర్ పంచాయతీ అయినా సొంత భవనం లేక ఇబ్బందిపడుతున్నారు. మల్లాపల్లి సచివాలయ భవన నిర్మాణాలను గ్రామానికి 2.5 కిలోమీటర్ల దూరంలో గుమ్మయ్యగారిపల్లి వద్ద ఏర్పాటు చేయడంతో పంచాయతీ ప్రజలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మైనర్ పనులు జరగాలి



మల్లాపల్లి సచివాలయ భవనాలకు నీటి సౌకర్యం, ప్లంబిక్ వర్కర్, ఎలెక్ట్రిక్, శానిటేషన్ పనులు పూర్తి చేయాలి. గోరంట్లలోని 2, 3, 4 సచివాలయాల్లో చిన్న చిన్న పనలుఉ చేయాల్సి ఉంది. మిగిలిన గ్రామాల్లోని 14 సచివాలయాల్లో సగం పనులు జరగగా, మిగిలిన సగం నిర్మాణం జరగాల్సి ఉంది. పాఠశాల ఆవరణలో ఉందని, ఒకటి పెండింగ్‌లో ఉందని, మిగిలినవి పనులు పూర్తిచేయడానికి చర్యలుచేపడుతున్నాం.

-వరప్రసాద్, ఏఈ, పంచాయతీరాజ్

పూర్తయిన భవనాలు ప్రారంభిస్తాం



పట్టణంలోని 2, 3, 4 సచివాలయాలు నూతన భవనాల్లో చిన్న చిన్న పనులు పూర్తి చేసి, రెండురోజుల్లో సిబ్బంది అక్కడ పని చేలా చర్యలు చేపడతాం. మల్లాపల్లి సచివాలయం భవనాలకు నీటి సమస్య, ఇతర పనులను స్థానిక పంచాయతీ ద్వారా పూర్తి చేయాలి.

-నరేంద్రకుమార్, ఎంపీడీఓ, గోరంట్ల


విద్యార్థులకు మట్టి గణపయ్యలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మట్టి వినాయకులను పూజిద్దాం

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టివినాయకున్నే పూజిద్దామని పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. చవితి పండును పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేదిశగా మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, విజయేంద్ర, శశికళ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


అగళిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు

పెనుకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మట్టి వినాయకున్ని పూజించి కాలుష్యాన్ని నివారించాలని మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను పూజించి వాటిని బావుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి, వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని విజ్ఞప్తి చేశారు.

అగళి: గణేశ్ చతుర్థికి వీధుల్లోనూ గణనాథులకు మండపాలు ఏర్పాటుచేసి గణపతులను కూర్చొబెట్టడానికి విగ్రహాలు సిద్ధమయ్యాయి. మండల కేంద్రంలో వినాయక చవితి పండగను చిన్న చిన్న, పెద్దవిగ్రహాలు అనే తేడా లేకుండా మట్టితో ఏర్పాటు చేసుకుని అమ్మడానికి సిద్ధంగా ఉన్నాయి.

శాంతి కమిటీ సమావేశం


వినాయక మండప నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్ఐ రంగడుయాదవ్

పరిగి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహ మండపాల ఏర్పాటుపై నిర్వాహకులతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ రంగడు యాదవ్ ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ రెడ్డప్ప, ఏఈ సంజీవప్ప, ఎస్ఐ మాట్లాడుతూ మండపాలు ఏర్పాటుచేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10గంటల తరువాత లౌడ్‌స్పీకర్లు ఉపయోగించరాదన్నారు. నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి ఉండదన్నారు. శాంతీయుతంగా గొడవలు జరగకుండా నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే ఆయా మండప నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆర్ఐ సిద్దేశ్, ఏఎస్ఐ బాలరాజు, కానిస్టేబుల్ సురేష్, శివ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ మట్టి వినాయకుల పంపిణీ


మట్టి విగ్రహాల పంపిణీలో నిమ్మల విద్యాధరణి, నాగరాజు

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీలో టీడీపీ నాయకులు, వార్డు సభ్యులు లక్ష్మీనాగరాజు మట్టి వినాయక విగ్రహాలను సోమవారం ప్రజలకు అందించారు. మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి చేతుల మీదుగా విగ్రహాలను పంపిణీ చేశారు. ఐదు సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితికి మట్టి వినాయకులను నాగరాజు అందచేయడం ఆనవాయితీగా వస్తోంది. టీడీపీ నాయకులు రామచంద్ర, సుధాకర్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: సీఐ

మడకశిర టౌన్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేసేవారు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీఐ నాగేష్‌బాబు తెలిపారు. ఇందుకు పోలీస్‌స్టేషన్‌కు రావల్సిన పనిలేదన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు గణేశ్‌ఉత్సవ్ నెట్ అనే సైట్‌లో లాగిన్ అయి విగ్రహం ఎత్తు, కమిటీ మెంబర్లు కనీసం ఐదుగురికి తగ్గకుండా అందులో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన వివరాలు మా లాగిన్‌లోకి వస్తాయని పరిశీలించి వినాయక విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇస్తామన్నారు. వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తు చేసుకొన్నవారికి బార్‌కోడ్ వస్తుందని తెలిపారు. బార్‌కోడ్‌ను మీరు ఏర్పాటు చేసే విగ్రహం వద్ద అతికించుకోవాలని ఊచించారు. బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు అందులో ఉంటాయని వివరించారు. ఇప్పటికే వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి 32 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని అందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

వినాయక విగ్రహ ఏర్పాటుకు విరాళాలు

రొద్దం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరసిద్ధి వినాయకుడి సేవాసంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకులు విరాళాలు అందజేశారు. సోమవారం బీజేపీ నాయకులు విరాళాల సేకరణకు వెళ్లగా పవన్ రూ.40వేలు విలువచేసే సేవా కార్యక్రమానికి అందిస్తున్నట్లు ప్రకటించారు. మాధవనాయుడు రూ.10వేలు, ఈడిగ శ్రీనివాసులు రూ.10వేలు, శేషాపురం అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.10వేలు, తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ రూ.10వేలు విరాళాలు అందించారు. బీజేపీ నాయకులు నీరుగంటి వేణుగోపాల్, రవిశంకర్, తిప్పేస్వామి, రాజా, నెట్టరామాంజి, నరసింహ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

పరిగి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. 29వ తేదీన క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి వెళ్లాలంటూ హెచ్ఎం కృపాసత్యరాజు, పీటీ వినోద్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.


పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థినులు